క్లుప్తంగా

135 మందికి కంటి పరీక్షలు



ఉచితంగా కంటి పరీక్షలు చేస్తున్న దృశ్యం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): లయన్స్ క్లబ్ ప్రతినిధి మానేపల్లి రామారావు ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక పేరయ్య కోనేరు ప్రాంగణంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో వేమగిరికి చెందిన పరమహంస యోగానంద నేత్ర వైద్యశాల వైద్యులు రోగులకు ఉచితంగా పరీక్షలు నిర్వహించారు. కంటి చూపును కాపాడుకోవడానికి అనేక జాగ్రత్తలు సూచించారు. ఈ సందర్భంగా 135 మంది కంటి పరీక్షలు చేశారు. 32 మందికి కళ్లజోళ్లు పంపిణీ చేసి మందులు ఉచితంగా అందజేశారు. 16 మందికి శస్త్రచికిత్సలు అవసరమని గుర్తించి వారికి ఉచిత శస్త్ర చికిత్సలు చేయడానికి ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పరసా శ్రీనివాసరావు, చెన్నా వెంకట్రామయ్య పాల్గొన్నారు.

రూ.23.50 లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

ఏలూరు టౌన్: పేదలకు అనారోగ్యం వస్తే ఒకప్పుడు అప్పులు చేస్తూ సరైన వైద్యం అందని దుస్థితిలో కొట్టుమిట్టాడుతూ తీవ్ర మానసిక వేదనకు గురయ్యే పరిస్థితి ఉండేది.. కానీ నేడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం హయాంలో పేదలకు ఆరోగ్య భరోసా ఏర్పడిందని ఏలూరు ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షులు ఆళ్లనాని అన్నారు. ఏలూరు శ్రీరామ్‌నగర్‌లోని క్యాంపు కార్యాలయంలో ఆదివారం నగరంలోని పలువురు పేదలకు వైద్య చికిత్సలు, శస్త్ర చికిత్సలకు గానూ ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన ఆర్థిక సహాయాన్ని బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే నాని, మేయర్ నూర్జహాన్ అందజేశారు. ఏలూరు నగరంలోని పలు ప్రాంతాలకు చెందిన 25 మంది పేదవర్గాలకు చెందిన బాధితులకు సుమారుగా రూ.23 లక్షల 50 వేల ఆర్థిక సహాయాన్ని చెక్కుల రూపంలో అందజేశారు. ఈ సందర్భంగా పలువురు బాధితులు తీవ్ర ఉద్వేగానికి లోనవుతూ తమకు కష్టం వస్తే అండగా నిలిచి ఆదుకుంటున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, ఎమ్మెల్యే ఆళ్ల నానికి కృతజ్ఞతలు తెలిపారు.

ఆర్థిక సహాయం

కొయ్యలగూడెం: ప్రమాదవశాత్తు బిడ్డలను కోల్పోయిన రెండు కుటుంబాలకు వైఎస్సార్‌సీపీ నాయకులు ఆదివారం ఆర్థిక సహాయం చేశారు. ధర్మారావు పేట సమీపంలో ఇటీవల చెరువులో పడి అదే గ్రామానికి చెందిన అద్దేపల్లి చందు, తాళ్లపూడి మండలం తాళ్లపూడికి చెందిన కొట్రా గగన్ సందేశ్ ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే తెల్లం బాలరాజు ఆదేశాల మేరకు వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ నాయకులు రెండు కుటుంబాల బాధితులను పరామర్శించి వారికి రూ.5 వేలు ఆర్థిక సహాయం, రెండువందల కేజీల బియ్యం అందజేశారు. ప్రభుత్వ సహాయం కూడా అందేలా కృషి చేస్తామని బాలరాజు హామీ ఇచ్చారన్నారు.

ఏలూరు వైఎస్సార్ సీపీలో జోష్



ఆళ్ల నానిని కలిసి కృతజ్ఞతలు తెలుపుతున్న వైఎస్సార్ సీపీ ఏలూరు నగర నూతన మహిళా అధ్యక్షురాలు స్వాతిశ్రీదేవి, పార్టీ నగర నూతన ముస్లిం మైనార్టీ అధ్యక్షులు రియాజ్ ఆలీఖాన్, పార్టీ నగర నూతన యువజన విభాగం అధ్యక్షులు నరేంద్ర, పార్టీ నగర నూతన ఎస్సీ విభాగం అధ్యక్షులు పాలిమేర దాసు, పార్టీ నగర నూతన బీసీ విభాగం అధ్యక్షులు లక్కోజు రాజగోపాలచారి, ఆయా కమిటీల సభ్యులు

- పార్టీ నగర నూతన కమిటీల నియామకం
- ఎమ్మెల్యే ఆళ్ల నాని క్యాంపు కార్యాలయంలో సందడి
- రాబోయే సార్వత్రిక ఎన్నికలకు సమాయత్తం

ఏలూరు టౌన్: ఏలూరు నగర వైఎస్సార్ సీపీలో నూతనోత్సాహం వెల్లివిరుస్తోంది. వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో ఏలూరు ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షులు ఆళ్ళ నాని నాయకత్వంలో ఏలూరు నగర పార్టీ నూతన కమిటీ, అనుబంధ విభాగాల కమిటీలు నియామకం అయ్యాయి. ఈ నేపథ్యంలో ఏలూరు శ్రీరామ్‌నగర్‌లోని క్యాంపు కార్యాలయంలో ఆదివారం సందడి వాతావరణం నెలకొంది. వందలాదిమంది పార్టీ అనుబంధ సంఘాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, నూతన కమిటీ సభ్యులు ఎమ్మెల్యే ఆళ్ళ నానిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. ఏలూరు నగర అధ్యక్షులు, ఇడా ఛైర్మన్ బొద్దాని శ్రీనివాస్ తొలుత ఎమ్మెల్యే నానిని గజమాలతో సత్కరించారు. జై ఎమ్మెల్యే ఆళ్ళ నాని...జైజై సీఎం జగనన్న నినాదాలతో ఆ ప్రాంతమంతా మార్మోగింది.

నగర పార్టీలో నూతన జోష్

ఏలూరు నగరంలోని వైఎస్సార్‌సీపీ క్యాడర్‌లో నూతన జోష్ వచ్చింది. రాబోయే సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఏలూరు నియోజకవర్గంలో పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసే దిశగా ఎమ్మెల్యే ఆళ్ళనాని ప్రత్యేక శ్రద్ధ వహించారు. నూతన కమిటీల్లోని వందలాదిమంది పార్టీ నేతలు క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే నానిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఏలూరు నగర అధ్యక్షులు బొద్దాని శ్రీనివాస్, బీసీ విభాగం అధ్యక్షులు లక్కోజు రాజగోపాలచారి, మహిళా విభాగం అధ్యక్షురాలు సున్నా స్వాతి శ్రీదేవి, నగర ముస్లిం మైనార్టీ అధ్యక్షులు రియాజ్ ఆలీఖాన్, నగర ఎస్సీ సెల్ అధ్యక్షులు పాలిమేర దాసు, నగర ఎస్టీ సెల్ అధ్యక్షులు దేవరకొండ శ్రీనివాస్, ఏలూరు యువజన అధ్యక్షులు నిడికొండ నరేంద్ర, నగర విద్యార్థి విభాగం అధ్యక్షులు ఏలూరు అంజనేయులు, నగర వాణిజ్య విభాగం అధ్యక్షులు బుర్రంశెట్టి బ్రహ్మయ్య, నగర చేనేత విభాగం అధ్యక్షులు కొల్లిపాక సురేష్, ఏలూరు వైఎస్సార్ సేవాదళ్ అధ్యక్షులు యల్లాపు మోజెస్, ఏలూరు నగర వైఎస్సార్ టీయూసీ అధ్యక్షులు లంకపల్లి వెంకటగణేష్ ఆధ్వర్యంలో నూతన కమిటీలన్నీ ఎమ్మెల్యే ఆళ్ళనానిని కలిశారు.

సైనికుల్లా పనిచేయాలి

రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో పేదలకు, పెత్తందార్లకు మధ్య పోటీ జరగబోతుందనీ, వైఎస్సార్ సీపీ నేతలు, కార్యకర్తలంతా సైనికుల్లా ఎన్నికల రణరంగంలో పోరాటం చేయాలని ఏలూరు ఎమ్మెల్యే ఆళ్ళనాని పిలుపునిచ్చారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. 2024 ఎన్నికల్లో ఏలూరు నియోజకవర్గంతో పాటు జిల్లాలోని 6 అసెంబ్లీ స్థానాలను కైవసం చేసుకునేందుకు ప్రతి ఒక్కరూ చిత్తశుద్ధితో పనిచేయాలని కోరారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాల అభ్యున్నతికి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరికీ వివరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ఎంఆర్ పెదబాబు, డిప్యూటీ మేయర్ నూకపెయ్యి సుధీర్‌బాబు, ఏపీ మెడికల్ కౌన్సిల్ సభ్యులు డాక్టర్ దిరిశాల వరప్రసాద్ తదితరులు ఉన్నారు.

బీజేపీ అనుకూల శక్తులను తరిమికొట్టాలి

ఏలూరు రూరల్: రాష్ట్రానికి తీరని ద్రోహం చేసిన బీజేపీ, అనుకూల పార్టీలను ప్రజలు వ్యతిరేకించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ రవి, సీపీఐ జిల్లా సమితి కార్యదర్శి ఎం కృష్ణచైతన్య ఓ సంయుక్త ప్రకటనలో పిలుపునిచ్చారు. వామపక్ష, లౌకిక వాద పార్టీలను బలపరచాలని కోరుతూ ఫిబ్రవరి 20వ తేదీ ఉదయం 10 గంటలకు విజయవాడ మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో రాష్ట్ర సదస్సు నిర్వహించనున్నామని వెల్లడించారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా కల్పిస్తామని, విభజన హామీలు అమలు చేస్తామని మోసపూరిత హామీలు ఇచ్చి బీజేపీ రాష్ట్ర ప్రజలను వంచించిందని పేర్కొన్నారు. రాష్ట్రానికి ఎనలేని కీడు చేసిన బీజేపీ, అనుకూల శక్తులను ఓడించేందుకు సర్వశక్తులు ఒడ్డుతామని వెల్లడించారు. ఈ సమయంలో వామపక్ష శక్తులు ఉమ్మడిగా ఒక తాటిపైకి తెచ్చి రాష్ట్ర ప్రజల గళం వినిపించేందుకు రాష్ట్ర సదస్సు ద్వారా నాయకులు కృషి జరుగుతుందని వివరించారు. లౌకిక పార్టీ నాయకులు, ప్రజా సంఘాల కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరుకావాలని కోరారు.

పేదలను ఆదుకోవాలి

భీమడోలు: తోటి వారిపై ప్రేమానురాగాలను కలిగి ఉండాలని, ఇదే క్రైస్తవత్వమని ఫాదర్ షింటో అన్నారు. భీమడోలు ఆర్‌సీఎం చర్చి పరిధిలోని విన్సెంట్ డి పాల్ సొసైటీ ఆధ్వర్యంలో క్రైస్తవ విశ్వాసులు తపస్సు కాల దీక్షను చేపట్టారు. దీనిలో భాగంగా పేదలను, అన్నార్తులను ఆదుకోవాలని చాటిన సెయింట్ విన్సెంట్ డి పాల్‌ను ఆదర్శంగా తీసుకుని తపస్సుకాలంలో ధానధర్మాలు చేయాలని షింటో అన్నారు. ఆదివారం సొసైటీ ఆధ్వర్యంలో 40 మంది యాచకులకు భోజన ప్యాకెట్లను ఉచితంగా అందించారు.

రెడ్డిక కార్పొరేషన్ డైరెక్టర్ జ్యోతిక రెడ్డికి సత్కారం



జ్యోతిక రెడ్డిని సత్కరించిన విజయరాజు

జంగారెడ్డిగూడెం రూరల్: గురవాయిగూడెం మానవతా కల్యాణ మండపంలో రెడ్డిక కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన దల్లి జ్యోతిక రెడ్డి అభినందన సభ ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న వైఎస్సార్ సీపీ చింతలపూడి నియోజకవర్గ సమన్వయకర్త కంభం విజయరాజు, రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్ దుక్కా లోకేశ్వరరరెడ్డి జ్యోతిక రెడ్డికి దుశ్శాలువా కప్పి సత్కరించారు. అనంతరం జరిగిన అభినందన సభలో విజయరాజు మాట్లాడుతూ నామినేటెడ్ పదవులలో మహిళలకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. ఈ సందర్భంగా రెడ్డిక కార్పొరేషన్ డైరెక్టర్ జ్యోతిక రెడ్డి మాట్లాడుతూ తనకు పదవిని కేటాయించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. తనకు అప్పగించిన బాధ్యతను చిత్తశుద్ధితో నిర్వహిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి, వార్డు కౌన్సిలర్ కాసర తులసి రెడ్డి, డాక్టర్ వింగ్స్ జిల్లా ప్రధాన కార్యదర్శి కఠారి సీతారాంబాబు, నాయకులు డెకనాల రాంబాబు, కొప్పుల రవిచంద్రారెడ్డి, రాఘవరాజు ఆదివిష్ణు పాల్గొన్నారు.

ఆసరాతో మహిళలకు ఆర్థిక భరోసా

- 5873 మందికి రూ.24.15 కోట్ల ఆసరా సొమ్ముల విడుదల
- హర్షం వ్యక్తం చేస్తున్న డ్వాక్రా సంఘాల మహిళలు



ఆసరా సొమ్ములు అందుకున్న కొల్లేరు గ్రామాల డ్వాక్రా సంఘాల మహిళలు



ఆసరా సొమ్ములు అందుకున్న శ్రీపర్రు మహిళలు

ఏలూరు రూరల్ : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం మహిళా లోకానికి బాసటగా నిలిచింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళల ఆర్థిక స్వావలంబనే ధ్యేయంగా డ్వాక్రా సంఘాలను బలోపేతం చేశారు. వైఎస్సార్ ఆసరా పథకం పేరుతో మహిళలు అన్ని రంగాల్లో స్వశక్తితో ఎదిగేలా ఆర్థిక భరోసా కల్పించారు. 2019 ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు డ్వాక్రా సంఘాల సభ్యులకు ఇప్పటివరకూ నాలుగు విడతల్లో రుణాలు చెల్లించారు. కరోనా మహమ్మారి కారణంగా రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సమస్యలను ఎదుర్కొన్నప్పటికీ జగన్‌మోహన్‌రెడ్డి డ్వాక్రా సంఘాల రుణమాఫీ అమలు చేసి చూపారు. 2019 ఎన్నికల నాటికి మహిళలు బ్యాంకుల నుంచి తీసుకున్న రుణం బాకీ గుర్తించి, ఇప్పటివరకూ మూడు విడతల్లో ఆయా సంఘాలకు రుణాలు చెల్లించారు.

- ఏలూరు రూరల్ మండల గ్రామాల్లో డ్వాక్రా సంఘాల సభ్యులు ఆసరా పథకం ద్వారా పెద్ద ఎత్తున లబ్ధి పొందారు. మొత్తంగా 15 గ్రామాల్లో 5,873 మంది లబ్ధిదారులు ఇప్పటివరకూ రూ.24 కోట్ల 15 లక్షల 66 వేల 805 అందుకున్నారు. ఇందులో రూ.10 వేల నుంచి రూ.15 లక్షల వరకూ లబ్ధి పొందిన సంఘాలు ఉండడం విశేషం. ఇందులో చాటపర్రు మహిళలు అత్యధికంగా రూ.4 కోట్ల 50 లక్షల 17 వేల 745, శ్రీపర్రు మహిళలు రూ.4 కోట్ల 65 లక్షల 93 వేల 368 అందుకున్నారు. ప్రభుత్వం నాలుగు విడతలుగా చెల్లించిన ఈ సొమ్ముతో సంఘాలు మరింత ఆర్థికంగా బలపడ్డాయి. విడతల వారీగా అందుకున్న మొత్తంతో సంఘం సభ్యులు పాలు, పెరుగు, చేపలు, మాంసం, కిరాణ, కుట్టు మెషీన్, పౌల్ట్రీ, సూపర్‌మార్కెట్, పండ్లు, బట్టలు వ్యాపారంతో పాటు కోళ్ళు, గొర్రెలు, గేదెలు, ఆవులు లాంటి పశుపోషణ సైతం నిర్వహిస్తున్నారు. ఫలితంగా గ్రామీణ ప్రజల జీవన విధానంలో మార్పు సంభవించింది. మహిళలకు ఆర్థిక భద్రత పెరిగింది. కుటుంబ పోషణలో భాగస్వాములు అవుతున్నారు. తమ పిల్లలను ఉన్నత విద్యావంతులను చేస్తున్నారు. ఫలితంగా గ్రామాల్లో సామాజిక అభివృద్ధి కనిపిస్తోంది.

గ్రామాల వారీగా విడుదలైన ఆసరా సొమ్ములు

గ్రామం	లబ్ధిదారులు	మొత్తం రూ.ల్లో
చాటపర్రు	1,193	4,50,17745
పైడిచింతపాడు	353	78,91,060
ప్రత్తికోళ్ళలంక	124	42,14,222
కోటేశ్వరదుర్గాపురం	242	90,49,481
కోమటిలంక	197	88,96,923
శ్రీపర్రు	1,037	4,65,93,368
పెదయాగనమిల్లి	139	80,10,490
గుడివాకలంక	755	3,0017,385
జాలిపూడి	754	3,50,09,981
మల్కాపురం	525	2,27,50,206
మాదేపల్లి	554	2,41,15,944

జగన్ ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు. మా సంఘం బ్యాంక్ నుంచి తీసుకున్న రుణాన్ని సీఎం చెల్లిస్తున్నారు. దీంతో ఒకొక్కరు సుమారుగా రుణమాఫీ సొమ్ములు రూ.12 వేలు అందుకున్నాం. లేదంటే మేం చాలా ఇబ్బంది పడేవాళ్లం. కరోనా సమయంలో పనులు లేక తీవ్ర అవస్థలు పడ్డాం. కుటుంబ పోషణ కష్టంగా మారింది. ఇలాంటి సమయంలో సీఎం విడతల వారీగా మా ఖాతాల్లో డబ్బు వేయడం సంతోషంగా ఉంది.

– జి వెంకటేశ్వరమ్మ, పెదయాగనమిల్లి

సొంత వ్యాపారంతో జీవనోపాధి



బ్యాంకుల నుంచి తీసుకున్న రుణంతో సంఘం సభ్యులు అనేక మంది సొంత వ్యాపారాలు చేసుకుంటున్నాం. ఒకరు కిరాణకొట్టు, మరొకరు బట్టల కొట్టు ఇలా ఎవరికి తెలిసిన వ్యాపారంతో వారు జీవనోపాధి పొందుతున్నారు. సీఎం వైఎస్ జగన్ మా సంఘం డబ్బులు చెల్లిస్తున్నందున మాకు ఎలాంటి భయం లేదు. ధైర్యంగా వ్యాపారం చేసుకుంటున్నాం.

– బలే పూలమ్మ, పెదయాగనమిల్లి

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	20	అరటి కాయ (1)	05-07
వంకాయలు (గులాబీ)	44	చిక్కుడు కాయలు	60
వంకాయలు (కాంతులు)	44	చామదుంపలు	56
వంకాయలు (తెలుపు)	--	ములక్కాడలు	05, 07, 10
బెండకాయలు	44	కంద	70
పచ్చిమిర్చి	32	బీట్‌రూట్	36
కాకర కాయలు	40-50	కీరా దోస	34
బీరకాయలు	44	ఫ్రెంచ్‌బీన్స్	60
కాలీఫ్లవర్	25-30	అల్లం	120
క్యాబేజీ	28	కొత్తిమీర (కట్ట)	15
క్యారెట్	30-36	పాలకూర	10
దొండకాయలు	38	చుక్కకూర	10
బంగాళదుంపలు	24	తోటకూర	10
ఉల్లిపాయలు	20-22	గోంగూర	08
గోరుచిక్కుడు	30	పుదీనా	05
దోసకాయలు	28-36	బఠాణి	--
అనబకాయ (1)	20-25	క్యాప్సికమ్	70
పొట్లకాయ(1)	15-20	చిలకడదుంప	28

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	18
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	29
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.30	44
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	16.00	--
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	35

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	08
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	23
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	06
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	18
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	21.00	4804	15
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	03
ఏలూరు - విశాఖపట్నం	12.00	4840	34

మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక శ్రద్ధ

- ఏలూరు ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షులు ఆళ్ళనాని
- రెండు డివిజన్లలో రూ.2.17 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు



ఏలూరు 28వ డివిజన్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ఆళ్ళనాని, చిత్రంలో మేయర్ నూర్జహాన్

ఏలూరు టౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో ప్రతి ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలనే సంకల్పంతో ప్రజలకు మెరుగైన రీతిలో మౌలిక సదుపాయాల కల్పనకు విశేష కృషి చేస్తున్నట్లు ఏలూరు ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షులు ఆళ్ళనాని చెప్పారు. ఏలూరు నగరంలో ఆదివారం పలు అభివృద్ధి పనులకు ఏలూరు నగర మేయర్ షేక్ నూర్జహాన్‌తో కలిసి ఆయన శంకుస్థాపనలు చేశారు. ఏలూరు కుమ్మరిరేవు కనకదుర్గమ్మగుడి ప్రాంతం, బీడీ కాలనీ వినాయకస్వామి గుడి ప్రాంతంలో 28, 29 డివిజన్లకు సంబంధించి అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. నగరంలోని 29వ డివిజన్‌లో రూ.1.57 కోట్లతో 11 సీసీ రోడ్లు, 20 సీసీ డ్రెయిన్లు నిర్మాణం చేసేందుకు చర్యలు చేపట్టారు. దీనికి గానూ గడపగడపకు మన ప్రభుత్వం (జీజీపీఎం) నిధులు రూ.1.20 కోట్లు, నగరపాలక సంస్థ సాధారణ నిధులు రూ.37.77 లక్షలు వెచ్చించనున్నారు. 28వ డివిజన్‌లో రూ.60 లక్షలతో 9 సీసీ రోడ్లు, 4 సీసీ డ్రెయిన్లు నిర్మాణం చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఈ సందర్భంగా ఏలూరు ఎమ్మెల్యే ఆళ్ళనాని మాట్లాడుతూ ఏలూరు నగరంలోని 50 డివిజన్లలో ప్రతి డివిజన్‌లోనూ అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేసేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తున్నామని చెప్పారు. గతంలో ఎన్నడూలేని విధంగా భారీ ఎత్తున అభివృద్ధి పనులకు నిధులు ఖర్చు చేస్తున్నామన్నారు. ఒకవైపు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కేటాయించిన నిధులతోపాటు ఏలూరు నగరపాలక సంస్థ సాధారణ నిధులను జతచేసి అభివృద్ధి పనులు చేపడుతున్నామని స్పష్టం చేశారు. ప్రజలు సహకరిస్తే మరింత అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో 29వ డివిజన్ కార్పొరేటర్ ఉచ్చుల సుజిత, పార్టీ నాయకులు సన్నీ, 28వ డివిజన్ ఇన్‌చార్జులు కొలికిపాముల తిరుపతిరావు, కొల్లిపాక సురేష్, ఏలూరు డిప్యూటీ మేయర్ నూకపెయ్యి సుధీర్‌బాబు, కోఆప్షన్ సభ్యులు మున్నల జాన్‌గురునాథ్, పార్టీ జిల్లా కోశాధికారి మంచెం మైబాబు, నగర కమిషనర్ సంక్రాంతి వెంకటకృష్ణ, పార్టీ నేతలు, కార్యకర్తలు ఉన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా వేట చేయరాదు

పోలవరం రూరల్: మత్స్యకారులు నిబంధనలకు విరుద్ధంగా వేట చేయరాదని స్థానిక మత్స్యశాఖ సహాయ ఇన్‌స్పెక్టర్ ఎస్.వెకంటేశ్వరరావు హెచ్చరించారు. గోదావరి నదిలో పోలవరం, గూటాల ప్రాంతం పరిధిలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నిషేధించబడిన వలలతో వేట చేయడం ఆయనకు ఫిర్యాదు అందడంతో ఆదివారం గోదావరి నది ప్రాంతంలో మత్స్యకారులు నివసించే ప్రాంతాలను పరిశీలించారు. మత్స్యకారులు గోదావరి నదిలో స్థావరాలు ఏర్పాటు చేసుకుని నిషేధించిన ప్రాంతాల్లో వేట చేయరాదన్నారు. నిషేధించిన వలలతో వేట చేయడం వల్ల కలిగేనష్టాలు, వేట నిషేధ సమయం పాటించడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ప్రతి సంవత్సరం ప్రభుత్వం మత్స్యశాఖ ద్వారా చేప పిల్లలను గోదావరి నదిలో విడుదల చేయడం జరుగుతుందన్నారు. చేపపిల్లలు పెరిగడం వల్ల మత్స్యకారులకు లబ్ధిచేకూరుతుందన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వేట చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మహిళలు కేన్సర్ వ్యాధిపట్ల అప్రమత్తంగా ఉండాలి



కేన్సర్‌పై అవగాహన ర్యాలీలో పాల్గొన్న మహిళలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): మహిళలు కేన్సర్ వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలని, తరచూ వైద్య పరీక్షలు చేయించుకోవడం ద్వారా కేన్సర్‌ను దరిచేరకుండా జాగ్రత్త పడవచ్చని నగరానికి చెందిన హోటల్ ఎస్ గ్రూప్ అధినేత నారా శేషు సూచించారు. స్థానిక జ్యూట్‌మిల్ వద్ద ధర్మభేరి ప్రాంగణంలో ఇన్నర్ వీల్ క్లబ్, హోటల్ ఎస్ గ్రూపు సంయుక్త ఆధ్వర్యంలో కేన్సర్‌పై అవగాహన సదస్సు, బైక్ ర్యాలీ, మహిళలకు ట్రెజర్ హంట్ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ట్రెజర్ హంట్ కార్యక్రమంలో పాల్గొని గెలిచిన విజేతలకు మొదటి బహుమతిగా రూ.5000, రెండవ బహుమతిగా రూ.3000, మూడవ బహుమతిగా రూ.2000 అందించారు. కార్యక్రమంలో ఇన్నర్ వీల్ క్లబ్ కార్యవర్గ అధ్యక్షురాలు పీడీసీ పీఎస్ లక్ష్మి, సెక్రటరీ జీ. అచ్యుత, కార్యవర్గ సభ్యులు, కేంద్ర పారిశ్రామిక మండలి మాజీ సభ్యులు పులి శ్రీరాములు, ఇళ్ళ శ్రీనివాస్, మాజీ కార్పొరేటర్ శానం రామకృష్ణ, నగర ప్రముఖులు పాల్గొన్నారు.